స్వాతి వీక్లీలో సీరియల్‌గా ప్రచురింపబడిన నవల

# సౌందర్యరాణి





మిస్
స్వర్ణహంస

**Miss Swarna Hamsa**

By Simha Prasad
e-mail : simhaprasad9@gmail.com

© **రచయిత**

ముద్రణ :

**మే 2018**

ముఖచిత్రం : బాలి

వెల : ₹ **80/-**

డి.టి.పి : **రాహెల్**

ప్రతులకు :

**kinige.com**

**Sri Sri Prachuranalu**
**401, Mayuri Estates,**
**MIG-II-650, KPHB Colony,**
**Hyderabad - 500085**
**Cell: 98490 61668**

# మిస్ స్వర్ణహంస

**ముం**బయి మహానగరం విలాసినిలా ఒళ్ళు విరుచుకొంటోంది. దాదాపు నగరవాసులంతా సుషుప్తిలోకి జారిపోతోంటే కొన్నిచోట్ల కొన్ని రకాల చైతన్యం చిందులేస్తోంది.

బార్లలో రంగుల కాంతుల మధ్య కాంతలు నగ్న తీగలై మెరుస్తున్నారు. గ్లాసుల్లో బంగారువర్ణపు ద్రవాలు, ప్లేట్లలో ఆహారపదార్థాలు, ఒంట్లోంచి పుట్టుకొస్తున్న ఆవిర్లు–వెరసి ఆనందపు తేరుపై తేలిపోతున్నారు కొందరు.

రెడ్‌లైట్ ఏరియాలో గుట్టుచప్పుడు కాని సంచలనం. కాగితపు పువ్వుల నవ్వులూ పెద్ద మనుషుల చీకటి ముసుగులూ నిశ్శబ్దంగా ఢీకొంటున్నాయి.

డిస్కోథెక్, మ్యూజిక్ క్లబ్, నైట్ క్లబ్–రకరకాల క్లబ్బుల్లో వెర్రితలలు వేస్తోన్న విశృంఖలత్వం బుసలు కొడుతోంది. అఫీమ్, గంజాయి, బ్రౌన్‌షుగర్‌లాంటి వాటి తీయని మత్తులో ఊగితూగి సోలిపోతున్నారు కొందరు యువతీ యువకులు.

ప్రముఖుల భవనాల్లో పెద్ద పెద్ద స్టార్ హెూటల్స్‌లో కంపెనీల గెస్ట్‌హౌసుల్లో మందునీ మగువల్నీ స్నేహంగా పంచుకుంటూ, పవర్నీ పరపతినీ ఫలాన్నీ పెంచుకుంటూ పోతున్నారు కొందరు.

పోలీసులు గస్తీ తిరుగుతున్నా స్మగ్లింగ్ నిరాటంకంగా క్రమబద్ధంగా సాగిపోతూనే వుంది.

అదే సమయంలో అండర్ కరెంటులా కొన్ని ముఖ్య ప్రదేశాలనుంచి అత్యంత ప్రముఖులు కొంతమంది ముంబయి నగరానికొచ్చారు.

వారి రాక అతి రహస్యం. వారి కదలిక మూడో కంటివాడిక్కూడా తెలీకుండా ఏర్పాట్లు చేయబడ్డాయి. వారిని ఎక్కడికక్కడ రిసీవ్ చేసుకుని జుహూ ప్రాంతంలోని ఓ భవనంలోకి తీసుకెళ్లారు.

మరుక్షణం వాళ్లు అదృశ్యమయ్యారు. వారెక్కి వచ్చిన కార్లూ మాయమయ్యాయి. భవనం మాత్రం ఏమీ ఎరుగని అమాయకురాల్లా నిశ్శబ్దంగా వుంది.

అది 'గోల్డ్ కోబ్రా'గా పేర్గాంచిన మాఫియా లీడర్, కింగ్‌పిన్ దాదా అహ్మద్ రహస్య స్థావరం.

అలాంటివింకా ఎన్నో వున్నాయి. ఇతర దేశాల్లోనూ వున్నాయి. నిజానికతడు

దుబాయ్‌లో వుండి స్మగ్లింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తూంటాడు.

మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలలోకి అతడి అనుమతి లేకుండా ఏ స్మగుల్డ్ వస్తువూ రావడానికి వీల్లేదు. నల్ల బంగారం, ఇతర విదేశీ వస్తువులూ భారతదేశపు సరిహద్దులకి రావాలంటే అతడు 'వూ' అనాల్సిందే! అత్యవసరమైనప్పుడు మాత్రమే ముంబయి వస్తాడు దాదా. వచ్చినట్లుగాని వెళ్లినట్టుగాని ఎవరికీ తెలీదు.

వీసాలూ పాస్‌పోర్టులూ లాంటి వాటికి అతీతుడతడు!

ఇందూభాయ్ కొత్తగా ముఖ్యమంత్రి పదవి చేబట్టిన సందర్భంగా భూగృహంలో పార్టీ ఏర్పాటుచేశాడు దాదా అహ్మద్. దేశంలోని అతి కొద్దిమంది అత్యంత ముఖ్యులైనవారికి మాత్రమే ఆహ్వానం అందజేయబడింది.

వారికి దాదా గురించి తెలుసు. అతడి మీదున్న కేసుల గురించీ వారంట్ల గురించీ తెలుసు. అయినా వచ్చారు. వారు సామాన్యులు కారు. ప్రభుత్వ పాలసీలని క్షణాల్లో మార్చగల శక్తివంతులు!

పాశ్చాత్య దేశంలోని నైట్ క్లబ్బుని తీసుకొచ్చి అమర్చినట్టుగా వుంది భూగృహం. రంగురంగుల పల్చని కాంతి మత్తుగా మంద్రంగా కురుస్తోంది. సినిమా సెట్టింగ్‌లాంటి ఫ్లోర్‌మీద "డామిట్–ఐ మస్ట్ హేవ్ సమ్‌థింగ్ ఎల్స్....." అంటూ ఊగిపోతూ పాడుతోందో అర్ధనగ్న సుందరి.

ఝూమ్మంటూ హైపిచ్‌లో ఉద్రేక సంగీతాన్ని ఉరకలేయిస్తోందో బృందం.

ఫ్లోర్ చుట్టూ అతిథులు ఒంటరిగా జంటగా గుంపుగా తినటానికి త్రాగటానికి ముచ్చటించుకోడానికి ముద్దు పెట్టుకోడానికి అనువుగా ఆసనాలున్నాయి.

విదేశీ మద్యం, స్వదేశీ మాంసాహారాలు అందిస్తూ అలరిస్తున్నారు విదేశీ స్వదేశీ భామలు.

కేవలం అతిథుల్ని సంతృప్తిపరచటమే తమ జీవిత లక్ష్యమైనట్టు ప్రవర్తిస్తున్నారు.

పార్టీకి ముఖ్యమంత్రి ఇందూభాయ్ వచ్చారు. ఆర్థికశాఖలోని 'గట్టి' సెక్రటరీ వచ్చాడు. ప్రధాని ఇన్నర్ సర్కిల్‌కి చెందిన ఓ స్నేహితుడొచ్చాడు. రక్షణమంత్రి కొడుకొచ్చాడు. నగర పోలీస్ కమీషనర్ వచ్చాడు. పార్టీల ప్రముఖ నాయకులో ముగ్గురొచ్చారు. ఓ ఆంగ్ల దిన పత్రికాధిపతి వచ్చాడు. ఓ హిందీ సినీనటుడొచ్చాడు. కస్టమ్స్ ఉన్నతాధికారీ వచ్చాడు. దాదా అహ్మద్ అందర్నీ కావలించుకున్నాడు. ఆప్యాయతని ఒలకబోశాడు. విడిగా కలివిడిగా సంభాషించాడు.

అంతా చాలా సరదాగా సంతోషంగా స్వేచ్ఛగా వున్నారు. సిగ్గు, పరువు, మర్యాద, స్టేటస్సు, హిపోక్రసీ అన్నిటినీ కేబ్రే డాన్సర్ పలువల్ని ఒలచి అవతల పారేసినట్టు పారేశారు. తమ పడగ్గదిలో జరుగుతున్న పార్టీయే అన్నట్టుగా ప్రవర్తిస్తున్నారు.

రక్షణశాఖా మంత్రి రామానుజంగారి అబ్బాయి అభిషేక్‌కి మాత్రం అక్కడ చాలా ఇబ్బందిగా వుంది. ఎంబ్రాస్సింగా వుంది. ఊపిరాడనట్టుగానూ వుంది.

అతడికి రాజకీయాలంటే ఆసక్తిలేదు. సిగ్గూ సంకోచం ఎక్కువ. చక్కగా వుంటాడు. స్నేహంగా నవ్వుతాడు. గులాబీ పువ్వులాంటివాడు అంటారతడి మిత్రులు. ప్రకృతంటే ప్రాణమిచ్చే బ్రహ్మచారి. అతడి తండ్రి రామానుజంగారు సీనియర్ మంత్రే కాదు. నెంబర్ టూ పొజిషన్లో వున్నాడు. ఆయనకీ దాదాకీ పరోక్షస్నేహముంది. అందుకే ఆహ్వానం పంపేడు. తను వెళ్లటం క్షేమం కాదని కొడుకుని పంపేరాయన.

పార్టీ అంటే ఏదేదో అనుకునొచ్చాడు అభిషేక్. కానీ పార్టీ అంటే తిండి, త్రాగుడు, వాగుడు, విశృంఖల శృంగారం–అన్నీ నిర్లజ్జగా ఆది మానవుల్లా అనుభవించడమే అని గ్రహించి సిగ్గుపడుతున్నాడు.

"ఏంటోయ్. కొండల్ని పిండి చెయ్యాల్సిన కుర్రాడివి. మునీశ్వరుడిలా ముక్కు మూసుక్కూర్చున్నావేం? కోరినదల్లా సిద్ధంగా వుంటుంది. అన్నీ రుచి చూడాల్సిన వయస్సు కదా. ఉప్పొంగి పో మై బోయ్" అంటూ భుజం తట్టాడు దాదా.

సిగ్గుతో వంకర్లు తిరిగిపోయాడు అభిషేక్.

నిలువెత్తు కేక్ కట్ చేశాడు ఇందూభాయ్.

అతడి మీద పూల వర్షం కురిసింది. తప్పట్లు మార్మోగాయ్. అతడ్ని అతిథులంతా అభినందనల్తో ముంచెత్తారు. వజ్రాల కిరీటాన్ని అతడి తలమీద అలంకరించాడు దాదా. తప్పట్లు మ్రోగాయి మళ్లీ.

ఆ కార్యక్రమం ముగిసేసరికి పార్టీ ఊపందుకుంది. కేబ్రే డాన్సులు మొదలయ్యాయి. రకరకాల రతి భంగిమల్ని ప్రదర్శిస్తూ మణికూజితాలు కూస్తోంటే ఆహూతుల శరీరంలోంచి ఆవిర్లు రాసాగాయి.

పరిస్థితి అర్థం చేసుకున్నట్టుగా బిలబిలమంటూ వచ్చారు టీనేజ్ అమ్మాయిలు. ఒక్కసారిగా అతిథుల్ని చుట్టేసి ఉక్కిరిబిక్కిరి చేసేశారు.

"వీళ్లంతా కన్నెపిల్లలే. మీకోసం ఏర్పాటుచేశాను. అనుమానముంటే వీళ్లు కన్నెలే అని డాక్టర్లిచ్చిన సర్టిఫికెట్లు చూపిస్తాను" కొంటెగా నవ్వాడు దాదా.

ఘొల్లుమన్నారు అక్కడున్నవారిలో కొందరు. ఉత్సాహంతో రెచ్చిపోయారు ఇంకొందరు.

సరిగ్గా అప్పుడొచ్చాడు మనీష్. ఒంటరిగా రాలేదు. ఓ అందాల బరిణె చేయి పట్టుకుని ప్రపంచాన్ని జయించిన వీరాధివీరుడిలా వచ్చాడు.

అతడు టెక్స్‌టైల్ టైకూన్. దేశంలోని ప్రఖ్యాత ఇండస్ట్రియలిస్ట్. బాంబే టెక్స్‌టైల్స్ అధినేత.

కానీ అందరి చూపులూ అతనితో వచ్చిన ఆ అందాలరాశి మీదే అతుక్కుపోయాయి.

ఆమె జగదేక సుందరిలా వుంది. క్లియోపాత్రాని మరపించేలా వుంది. సౌందర్యం పోత పోసినట్టూ బంగారానికి తావి అబ్బినట్టూ వుంది.

ఆమె ముందు అక్కడ పార్టీలో వున్న అందగత్తెలంతా వెలతెలబోయారు!

"మిస్ ఇండియా" ఎవరో అరిచేరు.

హర్షధ్వానాలు చేస్తూ స్వాగతం చెప్పేరంతా.

మనీష్ ముఖం కొంచెంగా నల్లబడింది.

అది గమనించినట్టుగా గబుక్కున ముందుకొచ్చి కౌగలించుకున్నాడు దాదా.

"సారీ. కొంచెం ఆలస్యమైంది....."

"ఇట్సాల్‌రైట్. మీరొచ్చారు. అది చాలు. అయామ్ వెరీ హ్యాపీ......" అన్నాడు. అనంతరం "హలో మిస్....." అని ఆమెని విష్ చేశాడు.

గబుక్కున వంగి పాదాభివందనం చేసిందామె. పరమానందపడిపోయాడతడు.

"మిస్ యూనివర్స్ కిరీటం నీదే" అన్నాడు దాదా.

"మీ ఆశీర్వాదముంటే తప్పకుండా గెలుచుకుంటాను" వినయంగా అంది స్వర్ణహంస.

"మా కంపెనీ స్పాన్సర్ చేస్తోంది" మనీష్ అన్నాడు.

అంతా అసూయగా చూశారతడ్ని. ఆమె మీంచి చూపులు మరల్చుకోలేక పోతున్నారంతా. ఆమె కళ్లల్లో మత్తు వుంది. ఎర్రటి పెదాల్లో కైపు వుంది. సగం కన్పిస్తోన్న వక్షద్వయంలో సవాల్ వుంది!

అంతా ఆమెకి పోటీపడి డ్రింకు గ్లాసులందిచ్చారు. రుచి చూసి థాంక్స్ చెప్పింది.

మెల్లగా ఆమె మనీష్ సొత్తు అన్న స్పృహ కలగ్గా మిగతా అందగత్తెల్తో జత కట్టసాగారంతా.

స్వర్ణహంస అందర్నీ పలకరిస్తోంది. నవ్వులు విసుర్తోంది. అంతటా కలయతిరుగుతోంది. కానామె చూపులు ఒకరికోసం తీవ్రంగా అన్వేషిస్తున్నాయి.

అభిషేక్ కన్పించాడు. ఆమె కళ్లు ఆనందంతో మెరిశాయి. ఆమె వచ్చింది అతడి కోసమేనాయె!

అతడ్ని ఇదే ప్రథమంగా చూడటం. కానెంతో తెలిసినట్టుగా బాగా ఎరిగున్నట్టుగా వున్నాడు. చిన్నగా నవ్వుకుంది.

తన స్టైలే అంత. ఎవర్ని ఆకట్టు కోవాలంటే అతడి ఫొటోని రెండ్రోజుల పాటు పరిశీలిస్తుంది.

అతడి అలవాట్లూ అభిరుచులూ తెలుసుకుంటుంది. తనూ అవి నేర్చుకుంటుంది. అతడికి గుర్రపుస్వారీ ఇష్టమైతే తనూ నేర్చుకుంటుంది. అతడు చెస్ ఆటగాడైతే తనూ ఆ ఆట ఆడుతుంది!

అందుకే తనాశించినట్టు నడుస్తోంది తన జీవన రేఖ! అతి తక్కువస్థాయి నుంచి అత్యున్నత స్థానానికి హఠాత్తుగా ఎదిగింది. 'మిస్ ఇండియా' అయ్యింది.

ఇహ ఇప్పుడు తన దృష్టీ, తపనా, కాంక్షా అన్నీ 'మిస్ యూనివర్స్' మీద కేంద్రీకరించింది. ఎలాగైనా సరే ప్రపంచ సుందరి కిరీటాన్ని గెల్చుకుతీరాలి. కీర్తి కనకాల్ని స్వంతం చేసుకోవాలి.

అందు నిమిత్తం ఏమైనా చేస్తుంది.

ఎంతకైనా తెగిస్తుంది !

ఇటు టెక్స్‌టైల్ టైకూన్ మనీష్! అటు రాజకీయ స్వామీజీగా పేర్గాంచిన చిదానందస్వామి! వారి అండదండలు తనకి లభించాయి. ఇక తనకి అందనివీ అధిరోహించలేనివీ వుండవుగాక వుండవు!

మరి మూడునెలల్లో తను మిస్ యూనివర్స్ కావడం ఖాయం! అందుకు శారీరకంగా మానసికంగా తయారవుతూనే స్వామీజీ చెప్పిన పనులు చెయ్యాలి.

అప్పుడే తను లక్ష్యాన్ని సాధించగల్గుతుంది. తన మార్గం సుగమం అవుతుంది!

అభిషేక్‌ని వలలో వేసుకోమన్నారు స్వామీజీ. అందుకే వచ్చింది!

ఆనందంగా మందహాసం చేసింది హంస.

మనీష్‌తో సహా ముఖ్య అతిథులంతా రహస్యసమాలోచనలకి అటు ఇటు వెళ్లగా ఆ అదనుకోసం ఎదురుచూస్తోన్న హంస కదిలింది. కులుకులొలకబోస్తూ అమృతపు చిరునగవు చిందిస్తూ వరాలివ్వ వచ్చిన దేవతలా నెమ్మదిగా అభిషేక్ దగ్గరకి నడిచింది.

అప్సర కన్య దివినుంచి దిగివచ్చి జిగేల్‌మనే కాంతితో కళ్లముందు ప్రత్యక్షమైనట్లు భ్రమపడ్డాడో క్షణం అభిషేక్. సితార మీటినట్లు నవ్వింది మిస్ హంస.

అతడికి మతిపోయిందొక్కసారే.

ఇంతవరకూ ఎందరో అమ్మాయిల్ని చూశాడు. కవ్వించాలని, ముగ్గులోకి లాగాలని ఎందరో భామలు యత్నించారు. కానెప్పుడూ ఇలా జరగలేదు. ఎవ్వర్లోనూ లేని ఏదో ప్రత్యేకాకర్షణ సూదంటు రాయిలా బలంగా లాగేస్తోంది! ఆశ్చర్యం ఆనందం అభినందన–ముప్పేటగా అతడి కళ్లల్లో ప్రతిబింబించాయి!

అంతవరకూ అతడ్ని లోబరుచుకోడానికి అసఫల యత్నాలు చేస్తూ వచ్చిన అమ్మాయిలు ఆమెవంక అదోలా చూసి నిష్క్రమించారు.

"ఏవిటలా చూస్తున్నారు జన్మలో ఆడమొఖం చూడనట్టు!" గలగలా నవ్వేసింది.

తబ్బిబ్బు పడ్డాడు – "అది కాదండి. మరి..."

"మరి...?"

"మరి..." నీళ్లు నమిలేడు.

"మరి వదిలెయ్యండి. ఇంత చక్కని ఆహ్లాదకరమైన అద్భుతానంద నిలయంలో జడపదార్థంలా వుండటం బావోలేదు. కమాన్. లెటజ్ డాన్స్..."

"డాన్సా?"

"రాదా? డోంట్ వర్రీ. మనం ఏం చేస్తే అదే డాన్సు. మనల్నెవరూ గమనించరు. ఇంతమందిలో వున్నా మనదంతా ఏకాంతమే...." చెయ్యి అందిచ్చింది.

పేరిస్ ఫేషన్ పెరేడ్ నుంచో, హాలీవుడ్ నైట్‌క్లబ్ నుంచో, తనకోసం వచ్చి డాన్సుకి పిలుస్తున్నట్టు అనుభూతి కలిగింది అభిషేక్‌కి.

వెంటనే ఆమె చేయి అందుకున్నాడు.

మెత్తని ఆమె కరస్పర్శకి ఒడలంతా విద్యుత్తు పాకినట్టు అన్పించింది. అమాంతం ఆమెని గాఢంగా గుండెలకి హత్తుకుని, దొండపండులాంటి ఆమె పెదాలని చుంబించాలన్న కోర్కె వేయి పడగలు విప్పింది. బలవంతాన కోర్కెని అదిమిపట్టాడు. అయినా అతడి నిశ్వాసంలో బుసలు విన్పిస్తూనే వున్నాయి!

మగాడి సైకాలజీ తెలిసిన ఆమె అతడిలోని భావ సంచలనాన్ని ఇట్టే పసిగట్టేసింది.

తను హెలెన్‌లాంటి అద్భుత సౌందర్య రాశి. తన అపురూపమైన సౌందర్యానికి దాసోహమనని పురుష పుంగవుడుండడు. తనని చూసి తీరని దాహంతో తపించనివాడు అసలు మగాడే కాదు!

గర్వంగా నవ్వుకుంటూ "కమాన్ డియర్....." అంటూ చెయ్యి పట్టుకుని గబుక్కున లాగింది.

అతడొచ్చి ఆమె మీద పడ్డాడు. కిలకిలా నవ్వింది. తప్పు జరిగినట్టు కంగారు పడ్డాడతడు.

తనే అతడి నడుంని ఓ చేత్తో చుట్టేసి మరో చేత్తో అతడి చేతివేళ్లని బంధించింది.

మధ్యమధ్య తన శరీరాన్నతడికి సుతారంగా తాకిస్తూ అడుగులేస్తోంటే అనుసరించక తప్పలేదతడికి.

ఇదంతా నిజమా భ్రమా అన్నదింకా తేల్చుకోలేకుండా వున్నాడు అభిషేక్.

తననో అమ్మాయి ఆకర్షించడం, ఆమెతో తను నర్తించడం–కలలో కూడా జరగనిది మరి!

"ఎక్కడికెళ్లేరు మహానుభావా. స్వర్గలోకానికా? రంభ కన్పించిందా?"

"అబ్బెబ్బే. అదేం కాదు...."

"మరేవిటి. మనిషిక్కడ మనసెక్కడో!" అంటూ అతనివైపు ఓరగా చూస్తూ నవ్వింది.

"మీరు....మీరెవరు?" అని అడిగాడతను.

"కన్పించేదే సత్యం అన్నారు. కళ్లెదుట ఇంత పెద్ద సత్యాన్నుంచుకుని అదేం ప్రశ్న?"

"అహహ అదికాదు. మీ పేరూ అదీ....."

"హంస....స్వర్ణహంస.....మిస్ స్వర్ణహంస....చాలా?" కవ్వింపుగా అంది.

"ఓ మై గాడ్! మీరు మిస్ ఇండియా కదూ?"

"అఫ్‌కోర్స్....." గర్వంగా తలెగరేసింది.

"ఓహ్. సూపర్బ్. చాలా బావుంది...."

"ఏమిటి? నేనా, నా పేరా, నేను మిస్ ఇండియాగా ఎన్నికవడమా?"

"అన్నీను. మిమ్మల్నిలా కలుసుకునే అదృష్టం కలిగినందుకు చాలా సంతోషంగా వుంది. బై ది బై నా పేరు అభిషేక్. ఢిల్లీ నుంచి వచ్చాను..."

"తెలుసు..." అంది స్వర్ణహంస.

"అవునూ. మీరిక్కడికెలా వచ్చేరు? ఈ పార్టీకి కొన్ని రకాల ప్రముఖుల్నే పిలిచారే..."

"నేను ప్రముఖురాల్ని కాదా?"

"అహహ అది కాదు. మిస్ ఇండియా అని గౌరవంతో పిలిచే పార్టీ కాదిది...." అంటూ ఆగాడతను.

"అదేమో తెలీదుగాని మీ గర్ల్‌ఫ్రెండ్‌నని చెప్పగానే రాయల్ వెల్‌కమ్ లభించింది" నవ్వింది.

ఆమె చాలా తెలివైందనుకున్నాడు. ఆమె ప్రతి మాటా చేష్టా తనని మరింత బలహీనుడ్ని చేసేస్తున్నాయనీ గ్రహించాడు. ఆమె ఎవరో తెలుసుకోవాలన్న కోరికని నిగ్రహించుకోలేకపోతున్నాడు.

దాదా ఇస్తోన్న స్పెషల్ పార్టీకి రాగలిగిందంటే మిస్ ఇండియా అవడం వల్ల మాత్రమే కాదు, ఇంకేదో బలవత్తరమైన కారణమో లింకో వుండి తీరుతుంది....!

"అసత్యంలో ఊగుతూ కూర్చుంటే సత్యం మంచులా మెల్లగా కరిగిపోతుంది" అంది అతడి పెదాల మీద చూపుడువేలుతో సుతారంగా రాస్తూ.

ఆ మాటలు విని ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. తన మెదడులోకి చొరబడగలుగుతోందంటే ఆమె తప్పక మేధావి అయ్యుంటుందనుకున్నాడు.

"మీ గురించి చెప్పరూ" భరించరాని ఉత్సుకతతో వూగిపోతూ అడిగాడు అభిషేక్.

"సమయం వచ్చినప్పుడు చెబుతాను"

"మీరేం చేస్తున్నారో అదైనా చెప్పండి"

"ఓ స్వీట్‌బోయ్‌తో మాట్లాడుతున్నాను"

"అహ అదికాదు...."

"మరేది కావాలి?" కొంటెగా చూసింది.

తడబడ్డాడు.

"మోడలింగ్ చేస్తూ మిస్ యూనివర్స్ పోటీకి తయారవుతున్నాను"

"వెరీగుడ్. నేనే జడ్జీనైతే ఆ కిరీటం తెచ్చి మీ తలమీద పెట్టేసేవాడ్ని...."

ఉప్పొంగిపోయిందామె. మిస్ యూనివర్స్‌గా ఎన్నికైనట్టుగా సంబరపడింది.

"థాంక్యూ-థాంక్యూ సో మచ్....." అందతడి అరచేతుల మీద చుంబిస్తూ.

"అంత ఎక్సైట్ అవుతారేం. మీ అందం మీ తెలివితేటలూ తప్పక మీకాస్థానాన్ని అందిస్తాయి"

"మిస్ యూనివర్స్ లేదా మిస్ వరల్డ్‌గా ఎన్నికవడం నా జీవిత లక్ష్యం. నా అపురూప కల. నా నరనరంలో జీర్ణించుకున్న తపన. ఎలాగైనా సరే ఆ కీర్తి కిరీటాన్ని చేజిక్కించుకోవాలి. ప్రపంచ సుందరిగా మన్ననలందుతూ ప్రపంచాన్ని చుట్టి రావాలి. ఎన్నెన్నో కానుకలతో ఎంతో డబ్బుతో ప్రముఖుల పరిచయాలతో ధనిక వర్గంలోకి ఎగబ్రాకాలి. విందుల్లో వినోదాల్లో తేలి సోలి పోవాలి....!" అన్నది స్వర్ణహంస.

"తప్పకుండా మీ స్వప్నం సత్యమౌతుంది. ఇది మెచ్చుకోలు మాట కాదు మనస్సులోని మాట"

"థాంక్యూ...." అంటూ అతడ్ని హత్తుకుపోయింది.

ఇబ్బందిగా కదిలాడు. ఎవరైనా చూస్తున్నారేమోనని చుట్టూ చూశాడు. ఎవరూ చూట్టం లేదు. అంతా ప్రత్యేక గదుల్లోకి ఎప్పుడో వెళ్లిపోయారు!

"ఏవిటలా అయిపోయారు? ఎంత చిత్రకారుడైనా మాటిమాటికీ చిత్తరువైపోవడం ఏం బావోలేదు"

ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు అభిషేక్.

తన గురించీమెకంతా తెలుసా?

"నేను ఆర్టిస్టునని మీకెలా తెలుసు?" అడిగాడు.

"ఆర్టిస్టు మనస్సు ఆర్టిస్టుకి గాక మరెవరికి తెలుస్తుంది?"

"అంటే మీరు కూడా...గుడ్... మీరెలాంటి చిత్రాలు వేస్తారు?" ఉత్సాహంగా అడిగాడు.

"చూడాల్సిందేగానీ చెప్పకూడదు"

"అదేం?"

"అసలు మీరు చూడగలరా అని నా సందేహం"

"భలేవారే. చిత్రకళ నా ఆరో ప్రాణం"

"నా చిత్రాలని చూసి అదే మాటంటారేమోనని నా భయం!" చిత్రంగా కళ్ళార్పి నవ్వింది.

ఆమె మాటలు అర్థంకాక అయోమయంగా చూశాడు. కిలకిలా నవ్విందామె.

"అనవసరంగా అతిగా ఆలోచించి బుర్రపాడు చేసుకోవద్దు. చిత్రాలు చూశాక మీ ప్రాణమో నా ప్రాణమో చెబుదురుగాన్లే" అన్నది స్వర్ణహంస.

"రేపే వచ్చి చూస్తాను. మీ ఎడ్రస్సు ఇవ్వండి"

"రేపు మీరు ఢిల్లీ వెళ్లిపోవాలి కదా"

"వెళ్లాలి. కాని వెళ్లను..." అన్నాడు అభిషేక్.

"థాంక్యూ. మీ ఫోన్ నెంబర్ చెప్పండి. ఫోన్ చేసి నేనే చెబుతాను"

అభిషేక్ తన ఫోన్ నెంబరు చెప్పేడు.

"మీ ఫోన్ కోసం నిరీక్షిస్తూంటాను..."

ఆ సంగతి తనకి తెలుసునన్నట్టు చిన్నగా నవ్వింది స్వర్ణహంస.

అంతలో దూరంగా మనీష్ వస్తూ కన్పించాడు స్వర్ణహంసకి.

"సీ యూ స్వీటీ..." చటుక్కున అతడి పెదాల మీద ముద్దు పెట్టుకుని అక్కడి నుండి అదృశ్యమైపోయింది.

తనింకో మగాడితో సన్నిహితంగా వుండటం మనీష్‌కి తెలిస్తే ఎంత ప్రమాదమో ఆమెకి బాగా తెలుసు.

తన లక్ష్యసాధనకి అభిషేక్‌తోబాటు మనీష్ అవసరం కూడా ఎంతో వుంది!

అందుకు కారణం మిస్ యూనివర్స్ పోటీలో పాల్గొనడానికయ్యే ఖర్చునంతా భరిస్తోంది అతడి సంస్థే మరి!

"హలో డార్లింగ్. నన్నొదిలేసి ఎక్కడికెళ్లేవు" బుంగమూతి పెట్టింది హంస.

"సారీ డియర్. కొన్ని సీక్రెట్ వ్యవహారాలుండి..." వెర్రిగా నవ్వేడు.

అప్పటివరకూ అతడెక్కడికెళ్లిందీ, ఏం చేసి వచ్చిందీ గ్రహించలేనంత అమాయకురాలు కాదామె.

"నాకు తెలుసు డార్లింగ్. కన్నెపిల్ల ఎలా వుంది?"

కళ్ళు చికిలించి నవ్వాడతడు.

"నువ్వు అసాధ్యురాలివి...."

శృంగారానుభవం లేని కన్నెపిల్లకి తన మగతనం ప్రదర్శించి జబ్బలు చరుచుకుంటారు నడివయస్సు దాటిన కొందరు. మనీష్ కూడా ఆ బాపతువాడేనని

ఆమెకి తెలుసు.

దాదా అహ్మద్ దగ్గర సెలవు తీసుకునెళ్ళిపోయాడు మనీష్ స్వర్ణహంసతోబాటు.

గెడ్డం గోక్కుంటూ ఆమె వెళ్ళినవైపే సాలోచనగా చూస్తూండిపోయాడు దాదా.

పార్టీ సంరంభం క్రమంగా సద్దుమణుగుతోంది.

హంస వెళ్ళేక చాలాసేపు శిలలా కూర్చున్నాడు అభిషేక్.

అతడి మెదళ్లో ఆమె మాటలే మార్మోగుతున్నాయి. గుండెల్లో ఆమె రూపమే అలల్లా కదుల్తోంది!

జీవితంలో ముఖ్యమైనవన్నీ యాక్సిడెంటల్‌గా జరుగుతాయంటారు. అసలు తనిక్కడికి రావటం ఓ ఆశ్చర్యకరమైన విషయమైతే మిస్ స్వర్ణహంస పరిచయమవడం ఓ యాక్సిడెంట్!

ఇది తననెన్ని మలుపులు త్రిప్పి ఎక్కడికి తీసుకెళ్లనుందో!

ఎక్కడికి తీసుకెళ్ళినా సరే–అడవికైనా అధోలోకానికైనా సరే తను సిద్ధం!

ఆమె వెంట ఎక్కడికైనా సరే వెళ్ళిపోతాడు! ఎన్ని శిఖరాలనైనా అధిరోహిస్తాడు! ఎన్ని లోయల్లోకైనా జారతాడు!

ఆమె తనక్కావాలి!

'యస్.ఐ వాంట్‌హెర్! ఆమె స్వర్ణహంస కాదు స్వర్గహంస! తనకోసం స్వర్గాన్నుంచి దిగి వచ్చిన అప్సరాంగన!' ఉద్వేగంతో ఊగిపోతున్నాడు అభిషేక్!

ఆ సమయంలో తను నాగుబాము పడగమీది మణి కోసం అర్రులు చాస్తున్నాడని అతడికి తెలీదు!

అయితే అతడ్నీ హంసనీ దాదా అనుచరులు నిశిత నేత్రాలతో పరిశీలిస్తున్న సంగతి ఆ ఇద్దరికీ తెలీదు!!

## 2

అభిషేక్‌కి పిచ్చెత్తినట్టుగా వుంది.

స్వర్ణహంస ఫోన్‌కాల్ కోసం ఎదురు చూసి చూసి విసిగి వేసారిపోయాడు.

ఫోన్ చేస్తానని వాగ్దానం చేసి 41 గంటలు అంటే 2460 నిమిషాలు అంటే 147600 సెకన్లు అయ్యాయి. కానీ ఫోన్ మ్రోగలేదు. మ్రోగుతుందన్న ఆశ అంతకంతకీ అడుగంటుతోంది. అలా అని ఆమె 'హేత్' ఇస్తుందనీ భావించటం లేదు. ఎంచేతో ఆమె మాట తప్పే మనిషని అనుకోలేకపోతున్నాడు అభిషేక్.

నిన్ననే ఢిల్లీ తిరిగి వెళ్లాల్సింది. ఫ్లైట్ బుక్కింగు కూడా అయ్యింది. అయినా ఫ్లైట్ ఆమెకోసం కేన్సిల్ చేసుకుని ముంబయిలోనే వుండిపోయాడు.

సరదాగా నాలుగు రోజులు గడిపి వస్తానని తండ్రికి అబద్ధం చెప్పేడు!

నిట్టూర్చాడు. 'నిరీక్షణ బాధాకరమైంది సుమా' అనుకున్నాడు మళ్లీ మళ్లీ.

ఫోన్‌కోసం ఇంకా ఇలాగే తపస్సుచేస్తూ కూర్చుంటే పిచ్చెక్కుతుందేమో అన్పించి లేచాడు. అలా సిటీ తిరిగొస్తే ఫ్రెష్‌గా రిలీఫ్‌గా వుంటుందన్పించింది. ఏ క్షణంలోనైనా ఆమె ఫోన్ రావొచ్చని హోటల్‌రూంలోనే బందీగా వుండిపోయాడు మరి!

సిటీలోకెళ్తే దారిలో ఎక్కడైనా హంస తారసపడొచ్చన్న ఆశకూడా అందుకు పురిగొల్పింది.

డ్రెస్సప్ అయి క్రిందికొచ్చాడు.

రిసెప్షన్ కౌంటర్‌లో కీ బంచ్ ఇచ్చి కదలబోతూ ఆగాడు.

"హలో! నాకేమైనా కాల్స్‌వచ్చాయా?"

"రూం నెంబర్ ప్లీజ్....."

"442"

"నో ప్లీజ్. వచ్చివుంటే మీ రూంకి కనెక్షనిచ్చేవాళ్లం"

"థాంక్యూ"

"అన్నట్టు మీరు కేంద్రమంత్రిగారి అబ్బాయికదూ?"

అవునన్నట్లు తలూపాడు.

"మీకోసం ఒకరు ఇంతవరకూ ఏడెనిమిదిసార్లు ఫోన్ చేశార్సార్"

"మరి నాకెందుకు కనెక్షన్ ఇవ్వలేదు?" చిరుకోపంగా అడిగాడు.

"సారీ సర్! మీతో మాట్లాడాలని కోరలేదు. జస్ట్ మీ గురించి ఎంక్వైరీ చేశారంతే"

అతడి నుదురు ముడిపడింది.

"ఫోన్ చేసింది ఆడా మగా?"

నవ్వి అంది "అమ్మాయి సార్. టీనేజ్ అమ్మాయనుకుంటాను...."

"థాంక్యూ. ఏమడిగిందో చెప్పగలరా" తప్పకుండా హంసే అయి వుంటుందనుకుంటూ అడిగాడు అభిషేక్.

"మీరు రూంలో వున్నారా, ఖాళీ చేశారా అని అడిగారు. మిమ్మల్ని కలవలేదా సార్?" అని అడిగింది రిసెప్షనిస్టు.

"నేనే వెళ్లి కలుస్తాను"

మరోసారి థాంక్స్ చెప్పి హోటల్ బయటికి నడిచాడు. హంసకి తప్ప మరొకరికి తన గురించి ఎంక్వైరీ చెయ్యాల్సిన అవసరం లేదు. అంటే కేవలం తనని పరీక్షించడానికి దాగుడుమూతలాడుతోందన్నమాట!

ఆ ఊహకి ఉత్సాహం వెల్లువలా వచ్చేసిందతడికి.

'ఓటమి నన్ను తేలిగ్గా కాటు వెయ్యలేదు మిస్ హంసా' అని అరచి చెప్పాలన్పించింది.

చిన్నగా నవ్వుకుంటూ నోటితో ఈలవేశాడు.

ఆ సమయంలో ప్రక్క నుంచెళ్తోన్న ఆంగ్లోఇండియన్ చిత్రంగా చూసిందతడి వంక.

సిగ్గుతో తలొంచుకుని ముందుకి నడిచాడు.

టాక్సీలో నగరమంతా తిరిగాడు. స్వర్ణహంస ప్రఫుల్ల మోము కన్పిస్తుందేమోనని ఆశగా వెదికాడు. ఆమె కన్పించలేదు. కానీ యాడ్స్‌లోని మోడల్స్‌ని చూసే సరికో ఆలోచనొచ్చి ఎగిరి గంతేశాడు. ఇంతదాకా అంత చక్కని ఆలోచన ఎందుకు రాలేదో అని తనని తాను నిందించుకుంటూ తిన్నగా ఓ పత్రిక ఆఫీసుకెళ్లాడు.

హంస చిరునామా రహస్యాన్ని ఛేదించబోతున్నందుకెంతో ఆనందంగానూ, ఎక్సైటింగానూ వుంది అభిషేక్‌కి. ఆ పత్రిక ఎడిటర్‌ని కలిసి తనని తాను పరిచయం చేసుకున్నాడు.

"మిస్ ఇండియా స్వర్ణహంస గురించి రాసిన పత్రిక కాపీ ఇవ్వగలరా" అని అడిగాడు.

"ష్యూర్...." బీరువాలోంచి తీసిచ్చింది.

ఆ సంచిక ముఖచిత్రం కూడా స్వర్ణహంసదే వేశారు. రెండు నిమిషాలు రెప్ప వెయ్యకుండా చూశాడు.

ఎంత లవ్లీగా వుంది! కళ్లల్లో అహం, ఆత్మ విశ్వాసమూ ఉట్టిపడుతున్నాయి! పెదవుల ఒంపులో ఆకర్షణ! నవ్వులో, నడకలో, చూపులో, మాటలో-ఏదో ప్రత్యేకత! గుండెకి గాలమేసి లాగే అయస్కాంత శక్తి!

'అందగత్తెలెందరో వుండొచ్చు. కానీ అరుదైన అప్పరాంగన మిస్ స్వర్ణహంస' అని అనుకోకుండా వుండలేక పోయాడు అభిషేక్.

గబగబా ఇంటర్వ్యూ చదివాడు. ఇంటర్వ్యూ కోసం జవాబులు తయారుచేసుకుని ఇచ్చినట్టే వున్నాయి. తన ధ్యేయం గురించి ఆమె చెప్పిన మాటలు మాత్రం గుండె లోతుల్లోంచి వచ్చినవే అన్పించింది.

'నా తక్షణ లక్ష్యం మిస్ యూనివర్స్ లేదా మిస్ వరల్డ్‌గా ఎన్నికవడం. ఈ క్షణం నుంచీ కూడా ఆ సన్నాహాల్లోనే వుంటాను. ఎలాగైనా గెలిచి తీరతాను. ఇక పెళ్లీ పిల్లలూలాంటి ఝుంఝూటాలు నాకు సరిపడవు. ప్రపంచ ప్రసిద్ధ మోడల్నవుతాను. ప్యారిస్‌తో సహా ప్రపంచంలోని ప్రతి నగరంలో ఫ్యాషన్ లేడీగా బ్యూటిఫుల్ ఈవ్‌గా నా పేరు మార్మోగాలన్నది నా ఆకాంక్ష. కీర్తినీ ధనాన్నీ రెండు చేతుల్తో ఆర్జిస్తాను. అంతా నా

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Miss+Swarna+Hamsa**

* * *